సంక్షేమ సారథి జగనన్నకు అండగా నిలుద్దాం

• ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



పెనకచెర్లలో సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు నిరంతరం శ్రమిస్తున్న సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలుద్దామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని 31వ వార్డులో కౌన్సిలర్ బి.నగేష్‌తో కలిసి ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధిని తెలియజేయడంతోపాటు వారి యోగక్షేమాలు, కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరగా ఆయన వెంటనే స్పందించారు. నిర్ణీత వ్యవధిలోగా సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ కరోనాతో రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులెదురైనా సీఎం జగన్ మాత్రం నిర్విరామంగా సంక్షేమ పథకాలను అందించి ప్రజలకు తోడుగా నిలిచారన్నారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన సీఎం జగన్‌కు మరోసారి పట్టం కట్టాలని ఆయన అభ్యర్థించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, పార్టీ యువనేత సిబి.మంజునాథరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రామాంజినేయులు, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, వార్డుకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బాలుడి వైద్యఖర్చులకు రూ.20 వేలు ఆర్థికసాయం

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాజేశ్వరి కుమారుడు గోకులన్ వైద్యఖర్చులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అవకాశముంటే బాలుడికి మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాలుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గడప గడపకూ సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: రాష్ట్రంలో గడప గడపకూ సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం పెనకచెర్ల, పి.కొత్తపల్లిలో ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరి సాంబశివారెడ్డితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తర్వాత అభివృద్ధి ప్రజల కళ్ల ముందే కనిపిస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి తమకు నచ్చిన వారికి, తమ పార్టీ వారికి మాత్రమే పథకాలు అందించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒకటి కూడా నేరవెర్చ లేదన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, సర్పంచు బచ్చలన్న, ఎంపీపీ వెంకటనారాయణ, ఎంపీటీసీ ధనుంజయ, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నాగలింగారెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, నాయకులు రామాంజనేయులరెడ్డి, జయరాం, రామచంద్రారెడ్డి, హేమసుందర, సూర్యనారాయణరెడ్డి, రోహిణికాంత్‌రెడ్డి, పరమేష్, సత్యనారాయణ, శ్రీనివాసులు, దేవరప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందిస్తున్న సర్పంచ్ పార్వతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ నగర్‌కు చెందిన చింతమాని నాగార్జున కిడ్నీ సమస్యతో శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య భారతికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ పార్వతి అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ, వార్డు సభ్యుడు కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల పరిశీలన

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కాలేజీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను శనివారం అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించారు. అధికారులు చంద్రశేఖర్, అశ్వర్థ, అబ్దుల్ సుకూర్ దుకాణదారులకు పలు సూచనలు చేశారు.

యల్లనూరు: మండల వ్యాప్తంగా టపాసులు అమ్ముకునే వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఏఎస్‌ఐ సంపత్ తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ అనుమతి లేని పక్షంలో టపాసులను సీజ్ చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



బొజ్జన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుత్తి రూరల్: టి.కొత్తపల్లికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు జలాల్ బొజ్జన్న(65) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన బొజ్జన్న పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా పని చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బొజ్జన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల నాయకుడు మల్లికార్జున పాల్గొన్నారు.

వీకే సుధీర్‌రెడ్డికి ఘన నివాళి



వీకే సుధీర్‌రెడ్డి వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం కాలేజీ వ్యవస్థాపకులు వీకే సుధీర్‌రెడ్డి 6వ వర్ధంతి నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గేట్స్ ఎండీ రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ వీకే వాణి తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు భిక్ష

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో శనివారం నుంచి శివ, అయ్యప్ప, హనుమాన్ మాలధారులకు భిక్ష ఏర్పాటు చేసినట్లు గార్లదిన్నె గ్రామానికి చెందిన కాశిరెడ్డినాయన ఆశ్రమం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు శివమాలధారుల చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముక్కోటి ఏకాదశి వరకు కొనసాగుతుందని, మాలధారులు గమనించాలని సూచించారు.

పక్షానికోసారి నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి



వాటర్‌వర్క్స్ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వాటర్‌వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఉదయం పాత మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ నాన్ పీహెచ్ వర్కర్స్ మస్టర్‌ను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డుల్లో నీటిని వదిలినప్పుడు టర్న్‌కాక్, వాటర్‌మ్యాన్, ఫిట్టర్ తప్పనిసరిగా ఆయా కాలనీల్లో పర్యటించి నీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొళాయిలకు తప్పనిసరిగా ఆన్,ఆఫ్ వాల్వ్‌లను ఏర్పాటు చేయించాలని చెప్పారు. ఎంఈ గురప్పయాదవ్, ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

ఆలూరు కోన రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కోన రంగనాథస్వామి

తాడిపత్రిటౌన్: ఆలూరు సమీపంలో ఉన్న కోన రంగనాథస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామిని ముందుగా ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు అభిషేకాలు చేపట్టారు. పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

టపాసుల విక్రేతల దందా

• హోల్‌సేల్ ధరలంటూనే జేబులు ఖాళీ చేస్తున్న వైనం



తాడిపత్రిలో నిర్వహిస్తున్న టపాసుల దుకాణాలు

తాడిపత్రిటౌన్: లంచాలతో ఆయా శాఖల అధికారులను కొనేశాం మాకెవ్వరూ అడ్డూ అంటూ యథేచ్ఛగా పండుగ వేళ టపాసు విక్రేతల దందా సాగిస్తున్నారు. అంగళ్ల ముందు హోల్‌సేల్ ధరలకే అంటూ బోర్డులు పెట్టి జేబులు ఖాళీ చేసి పంపిస్తున్నారని ప్రజలు లబోదిబోమంటున్నారు. వివరాలు..పట్టణంలోని యల్లనూర్ రోడ్డు 1, కడప రోడ్డు సమీపంలో 1 శాశ్వత దుకాణాతోపాటు చుక్కలూరు రోడ్డు సమీపంలో 10 తాత్కాలిక టపాసుల దుకాణాలు వెలిశాయి. అయితే కొంత మంది అనుమతులు ఒక్క షాపునకు తీసుకొని వాటి పక్కనే ఐదారు షాపులు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. షాపుల వద్ద జాగ్రత్తలు పాటించకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పెద్దఎత్తున ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ అలెగ్జాండర్‌ను వివరణ కోరగా అధిక ధరలకు అమ్మినట్లు ప్రజలు రాత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు మరువలేనివి



గుంతకల్లులో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ గంగాధర్‌రావు



తాడిపత్రిలో ఆజాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుంతకల్లు టౌన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలు మరువలేనివి వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అహ్మద్ బాషా, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు తెలిపారు. శనివారం వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ సర్కిల్ వద్ద ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా అనేక సంస్కరణల ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆజాద్ ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కౌన్సిలర్లు జేసీబీ చాంద్‌బాషా, సుమోబాష, దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.హొన్నూర్‌వలి, జేసీఎస్ కన్వీనర్ ఎండీ.ఖలీల్, పార్టీ సీనియర్ నేతలు నూర్‌నిజామి, గఫార్‌ఖాన్, ఆర్‌డీజీ.బాషా, షేక్షా, మాబు, ఖాజా,అక్రమ్, సర్దార్, ధనుంజయ, షాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శప్రాయుడని ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్ గంగాధర్‌రావు పేర్కొన్నారు. శనివారం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఆజాద్ దేశాభివృద్ధికి చేసిన సేవలు కొనియాడారు. అనంతరం బెటాలియన్‌లో ట్రెయినింగ్ పూర్తి చేసుకున్న డీఎస్పీలు హేమంత్ కుమార్, పృథ్వీ తెలాను సన్మానించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సీతారామారావు, ఆర్ఎస్ఐలు బెటాలియన్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో శనివారం దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అబూబకర్, నాయకులు కుళ్లాయిబాబు, రామ్మోహన్, శామ్యూల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలను శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో స్థానిక పాత ఈద్గా సమీపంలో ఏర్పాటు చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఫయాజ్‌బాషా మాట్లాడుతూ ఆజాద్ ఆశయాల సాధను ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాబయ్య, పట్టణాధ్యక్షుడు జావిద్‌ఖాద్రీ, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తాడిపత్రి అర్బన్: స్థానిక నంద్యాల రోడ్డులోని విహారీ రెస్టారెంట్ వద్ద శనివారం కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎస్.పుల్లారెడ్డి, కమలాపురం మండలానికి చెందిన మీర్జాగావ్ దాదా హయాజ్, కొండాపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కంచం మైసూరారెడ్డిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 204 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని శనివారం అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. నిందితుల నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

తాడిపత్రి అర్బన్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సజ్జలదిన్నె సమీపంలో సీజ్ చేసినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. డ్రైవర్‌ను అరెస్ట్ చేసి టిప్పర్‌ను రూరల్ పోలీసులకు అప్పగించామన్నారు.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థిని



సౌమ్యను అభినందిస్తున్న హెచ్‌ఎం సరిత, పీఈటీ శిరీషా

పామిడి: ఖాదర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పీ సౌమ్య జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు ఆమెను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థినిని పాఠశాల హెచ్‌ఎం సరిత, పీఈటీ శిరీషా అభినందించారు.

మోటారు కేబుల్ చోరీ

పెద్దపప్పూరు: మండలంలోని షేక్‌పల్లి, పెద్దపప్పూరు, చాగల్లు గ్రామాల్లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దాదాపు 250 మీటర్ల విద్యుత్ మోటారు కేబుల్‌ను చోరీ చేశారు. పెద్దపప్పూరు జనార్దన్ రెడ్డి, నారాయణ స్వామి, రామకృష్ణ, షేక్‌పల్లి గంపిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, చాగల్లు లింగయ్య శనివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా మోటారు కేబుల్ చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.

ఆలయాల్లో శని త్రయోదశి పూజలు

పామిడి: పట్టణ భోగేశ్వర, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో శనివారం శని త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాల్లోని శని విగ్రహాలను శోభాయానంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు నల్లటి వస్త్రంతో శని దేవునికి అభిషేక అర్చనలు, దీపారాధన గావించారు. ఈసందర్భంగా భోగేశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ



నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: పాళ్యం వాసి, వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ నారాయణరెడ్డిని శనివారం ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నారాయణరెడ్డి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ధ్యానంపై అవగాహన

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ ధ్యానం పై అవగాహన కలిగి ఉండాలని పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు మల్లిఖార్జున పేర్కొన్నారు. శనివారం క్రిష్టిపాడు గ్రామంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ప్రజలకు ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్స్ ధ్యానంతో కలిగే లాభాలను వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ పరికరాల చోరీ

పుట్లూరు: శనగలగూడూరు సమీపంలో శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలు చోరీకి గురయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని వైరు, ఇతర విలువైన పరికరాలను దొంగలు అపహరించినట్లు బాధితుడు రఘునాథరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

దీపావళి శుభాకాంక్షలు



తాడిపత్రి అర్బన్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెదారెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగన్నారు. దీపావళి సందర్భంగా ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.

శింగనమల: నియోజకవర్గంలోని ప్రజలు దీపావళి పండుగను ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ విద్యా ప్రభుత్వ సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి కోరారు. వెలుగును పంచే పండుగ, అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అందరికీ మహాలక్ష్మీ కృపాకటాక్షాలు కలగాలని కోరారు.

గుంతకల్లుటౌన్: దీపావళి పర్వదినం సందర్భంగా నియోజకవర్గం ప్రజలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచిక ఈ దీపావళి పండుగ అని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరి జీవితాల్లో వెలుగులు, సంతోషం, శ్రేయస్సు మరింతగా రావాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలియజేశారు.

పశు కృత్రిమ గర్భధారణను సద్వినియోగం చేసుకోండి

శింగనమల: పశు కృత్రిమ గర్భధారణను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీఏ పద్మనాభం పాడి రైతులకు సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పశువైద్య కేంద్రంలో పాడి పశువులకు లింగ నిర్ధారిత వీర్యం అందిస్తామన్నారు. వీర్యం ద్వారా దాదాపు 90 శాతం పెయ్యదూడలు మాత్రమే పుడతాయన్నారు. రూ.1350 విలువైన వీర్యాన్ని ప్రభుత్వం రూ.500 లకు సబ్సిడీతో అందిస్తున్నదన్నారు. ఒక వేళ చూడి నిలువక పోతే రూ.500 వెనక్కి వస్తుందన్నారు. మగ దూడ జన్మిస్తే రూ.250 వెనక్కి అందిస్తామన్నారు. సగటున 10 నెలల పాల దిగుబడి 3 వేల లీటర్లు నుంచి 7 వేల లీటర్లు అందించేటువంటి దూడలు పుట్టే అవకాశం ఉందన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: బసినేపల్లి తండా గ్రామానికి చెందిన ఓ యువతి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన యమునా కొన్ని అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న యువతిని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు: క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్ అధికారులను కోరారు. ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు టీ.సురేష్ ఆధ్వర్యంలో స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. క్లాప్ ఆటోడ్రైవర్లకు 5 నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రాము రాయల్, ఏఐటీయూసీ నాయకులు మల్లయ్య, నరసయ్య, నీలావతి, క్లాప్ ఆటోడ్రైవర్ల సంఘం నాయకులు చిన్నమాతయ్య, నాగరాజు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

14న మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 14న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు శనివారం తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కూలీల సంఖ్య పెంపునకు చర్యలు

మడకశిరరూరల్: మండలంలో ఉపాధి హామీ కూలీల పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఓ శ్రీకాంత్‌గౌడు శనివారం తెలిపారు. మండలంలో మూడు రోజులు మోస్తరు వర్షం పడడంతో పనులు చేయడానికి భూమిలో తేమశాతం ఉండడంతో ఉపాధి పనులు చేసేందుకు కూలీలు ముందుకొస్తున్నారన్నారు. వంద రోజులు పనులు పూర్తి కాని కూలీలకు వాటిని పూర్తి చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డుపై జెడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. నంద్యాల జిల్లా పోతుదొడ్డికి చెందిన రామాంజనేయులు, చరణ్ గుత్తికి బైక్‌పై బయలుదేరారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

• డీఆర్‌ఎంకు ఎమ్మెల్యే వైవీఆర్ విన్నపం



డీఆర్‌ఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: పట్టణంలో రైల్వే పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌కు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం ఎమ్మెల్యే డీఆర్‌ఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు రైల్వే సమస్యలపై చర్చించారు. ధర్మవరం గేట్ ఆర్‌యూబీ పనుల టెండర్లఎంత వరకు వచ్చాయని ఎమ్మెల్యే ఆరా తీశారు. పట్టణాభివృద్ధికి ఆటంకంగా ఉన్న ధర్మవరంగేట్ ఎల్‌సీ గేట్ తొలగించి వెంటనే ఆర్‌యూబీ పనులు చేపట్టేలా చూడాలని కొరారు. కసాపురం రోడ్డులోని మార్కెట్ సమీపంలో రైల్వేమోరీ చాలా ఇరుకుగా ఉందని దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. ఈ మోరీని టూవే రూపంలో మార్చాలనే ప్రతిపాదనలు రైల్వే, మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ సంయుక్తంగా తయారు చేసి జోనల్ అధికారులకు పంపిన విషయాన్ని గుర్తుచేశారు. ఎస్‌జేపీ హైస్కూల్–రోటరీ హైస్కూల్ మార్గంలోని గుంతకల్లు–కల్లూరు రైలు మార్గంపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్‌ఓబీ) నిర్మించే ప్రతిపాదనలు ఎంత వరకు వచ్చాయని డీఆర్‌ఎంను అడిగారు. ఆర్‌యూబీ, మోరీ విస్తరణ, ఎఫ్‌ఓబీ నిర్మాణపనులపై పూర్తిస్థాయిలో నిమగ్నమై వెంటనే పనులు చేపట్టేలా చూడాలని ఆయన డీఆర్‌ఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ధర్మవరం గేట్ వద్ద ఆర్‌యూబీ పనులకు మరికొన్ని రోజుల్లోనే టెండర్లు నిర్వహించి ఖరారు చేస్తామన్నారు. ఇక కసాపురం రైల్వే మోరీ వంతెన విస్తరణ సంబంధించి ఫైల్ రైల్వేబోర్డుకు చేరిందని, వెంటనే ఈ విషయం ఆరా తీసి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, నాయకుడు సీఎం బాషా తదితరులు పాల్గొన్నారు.